ప్రజాశక్తి

మంగళవారం 7 మార్చి 2023 5 విజయనగరం

మత్స్యకారులకు వంద బోట్లు మంజూరు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద 2020-2021 సంవత్సరానికి 40 బోట్లు, 2021-2022 సంవత్సరానికి 60 బోట్లును మత్స్య శాఖ కమిషనర్ మంజూరు చేశారు. ఈ పథకంలోని యూనిట్ ఖరీదు రూ. 5 లక్షలు కాగా జనరల్ లబ్ధిదారులందరికీ 40శాతం రాయితీ, లబ్ధిదారుల వాటా 60శాతం (రూ. 3లక్షలు) ఉంటుంది. ఈ పథకం కేంద్ర ప్రయోజిత పథకమైనందున రాయితీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉంటుంది. ఇది వరకే మర బోట్లు లేదా తెప్పలు కలిగి ఉండి అవి వేటకు ఉపయోగకరంగా లేకుండా ఉంటే వారు ఈ పథకానికి అర్హులు. ఆసక్తి కలిగిన సముద్ర మత్స్యకారులకు ఈ పథకం కావాలనుకుంటే గ్రామ సచివాలయంలోగల గ్రామ మత్స్యసహాయకులు లేదా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి, భోగాపురం లేదా మత్స్యశాఖ ఉప సంచాలకులు, విజయనగరం వారిని సంప్రదించాలని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

గుంకలాంలోని జగనన్న లే అవుట్

పంచపాండవులెంతమంది అంటే మంచం కోళ్ల మాదిరిగా మూడేనంటూ రెండు చూపుడు వేళ్లు చూపించినట్టుగా ఉంది మన జిల్లాలో గృహ నిర్మాణం లెక్క తీరు. ఆర్థిక ఇబ్బందులు, ఇసుక కొరత, పెరిగిన నిర్మాణ సామంగ్రి ధరల నేపథ్యంలో నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. వ్యక్తిగత స్థలాల్లో మినహా చాలా వరకు జగనన్న లేఅవుట్లు పునాదులు, మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. సగానికిపైగా నిర్మాణ పనుల ప్రారంభానికి నోచుకోలేదంటే అతిశయోక్తి కాదు.

నత్తనడకన గృహ నిర్మాణం

- ప్రారంభానికి నోచుకోని 30 వేల ఇళ్లు
- పునాదుల స్థాయిలో నిలిచిన 15 వేల ఇళ్లు
- పూర్తయినవి మూడో వంతే
- గుంకలాం లేఅవుట్లో మరీ అధ్వానం
- ఉగాది నాటికి గృహ ప్రవేశాలు అనుమానమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 77,205 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 34 వేల వరకు జగన్న లేఅవుట్లలోనివే. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. మంజూరైన మొత్తం ఇళ్లలో 25,404 వరకు నిర్మాణాలు పూర్తి అయినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే మూడో వంతు మాత్రమే నిర్మాణాలు జరిగినట్టు లెక్క. వీటిలోనూ సొంత స్థలాల్లో నిర్మించుకున్నవే ఎక్కువగా ఉన్నాయి. జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు తక్కువగా ఉన్నాయి. దాదాపు 30వేల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టలేదు. 14,959 మంది పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఉగాదినాటికి ఇళ్లు పూర్తిచేయడం, సామూహిక గృహ నిర్మాణాలు అనుమానంగానే ఉన్నాయి. దీన్ని కప్పిపుచ్చు కునేందుకు ప్రభుత్వం ఉగాది లక్ష్యం కొంతేనంటూ కొత్తపల్లవి అందుకుంటోంది. ఈ లెక్కలను కాస్త పరిశీలిస్తే 34,500 ఇళ్లను మాత్రమే లక్ష్యం పెట్టుకున్నామని చెబుతోంది. అందులో 25వేల వరకు పూర్తయినట్టు చెబుతున్నా వీటిలో సొంత స్థలాల్లో కట్ట ఆర్థికంగా అవకాశమున్నవారే ఎక్కువగా కనిపిస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు పెద్దగా జరగడం లేదనడానికి రాష్ట్రంలోనే అతిపెద్ద లేఅవుట్గా చెప్పుకుంటున్న గుంకలాం లేఅవుట్లో నిర్మాణాలు మచ్చుకునకూ చెప్ప వచ్చు. ఈ లేఅవుట్లకు అవసరమైన సిమెంటు గోడౌన్లు, విశ్రాంతి షెడ్లు తదితర కోసం రూ.కోట్లు ఖర్చుచేశారు. అయినా నిర్మాణాలు అంతంత మాత్రమే జరిగాయి. 2020 డిసెంబర్ 31న సాక్షాత్తు సిఎం జగన్మోహన్రెడ్డి పట్టాలు జారీచేసిన ఈ లేఅవుట్లో 12,216 ప్లాట్లు పంపిణీ చేయగా, వీటిలో 10,112మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు రూ. 1.80లక్షలు ఏమూలకూ సరిపోవే పరిస్థితి లేకపోవడంతో కేవలం 2,132మంది మాత్రమే సొంతంగా ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. మిగిలిన వారంతా ఆర్థిక ఇబ్బందులతో చేతులెత్తేశారు. దీంతో, 3వ ప్రత్యామ్నాయం పేరిట మిగిలిన వారందరికీ సొంతంగా ఇళ్లు నిర్మిస్తామంటూ బలవంతంగా బ్యాంకు అకౌంట్లు ఓపెన్చేయించి మరీ రంగంలో దింపారు. కానీ, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో ఆయా నిర్మాణాలన్నీ పునాదులతోనే ఆగిపోయాయి. ప్రభుత్వం తరపున తలపెట్టిన 7980 ఇళ్లలో 4,500 ఇళ్లకు మాత్రమే పునాదులు పడ్డాయి. వీటిలో 12ఇళ్లకు మధ్యస్థంగా గోడలు నిర్మించారు. ఒక్కటంటే ఒక్కటి కూడా నోచుకోలేదు. మిగిలినవి పునాదులకు కూడా నోచుకోలేదు. ఇక సొంతంగా నిర్మించుకున్న 2132 ఇళ్లలో 1680 ఇళ్లు పునాదుల స్థాయిలోనే నిలిచిపోయాయి. 106 వరకు మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. ఇప్పటి వరకు నిర్మాణం పూర్తయినవి కేవలం 138 మాత్రమే. మరో 78 స్లాబ్ వరకు వచ్చాయి. వీటికి కూడా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. రాష్ట్ర స్థాయిలో అతిపెద్ద లేఅవుట్గా చెప్పుకున్న సాక్షాత్తు సిఎం పట్టాలు పంపిణీ చేసిన చోటే ఇలా ఉంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందో వేరేగా చెప్పనక్కర్లేదు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడతా

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

పాలకొండలో ప్రచారం చేస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - కలెక్టరేట్, పాలకొండ

విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్ల, మధ్యతరగతి వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించడంతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడతానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. సోమవారం ఆమె పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం సుందరయ్య భవనంలోను, పాలకొండలోను ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ రంగ పరిరక్షణకు, సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్స్తో పాటు గిరిజన ప్రాంతంలో రద్దు చేసిన జిఒ3 పునరుద్ధరణకు, చట్టబద్ధత కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిస్వార్థంగా, నిజాయితీగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నేడు చట్టసభల్లో అన్ని తరగతుల ప్రజల సమస్యలు చర్చకు తీసుకొస్తున్నది కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని అన్నారు. ప్రభుత్వ రంగం బలోపేతం, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ, సిఆర్టి, గెస్ట్ ఫ్యాకల్టీ, పార్ట్ టైం వంటి ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలు, ఉపాధి కల్పన, కనీస వేతనం, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ సంస్థల ఖాళీల భర్తీ, కార్మిక చట్టాల సవరణ వంటి అనేక అంశాలపై ప్రజల తరపున నిజాయితీగా పనిచేస్తున్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధించలేదు సరి కదా మరింత వెనుకబాటులోనికి నెట్టబడిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టాన్ని అపహాస్యం పాలు చేస్తుందని విమర్శించారు. రైల్వే జోన్ నేటికీ ఇవ్వలేదు కానీ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన విశాఖ రైల్వే డివిజన్ను ఎత్తివేయాలని నిర్ణయించిందని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అనేక అభివద్ధి సంస్థలను కలుపుకొని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యాన శక్తి మేరకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి గెలిచిన ప్రజా ప్రతినిధికి ఈ ప్రాంత అభివద్ధి పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ఈ నేపథ్యంలో మన ప్రాంత ప్రజల వాణి చట్టసభల్లో వినిపించడానికి ఉన్నత విద్యావంతురాలిగా 250లకు పైగా ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు బలపరుస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు జి.వెంకటరమణ, వి.ఇందిర, పి.రాజశేఖర్, కె.రాజు, సిహెచ్ సింహాచలం, తిరుపతిరావు, దావాల రమణారావు, పి.ప్రభాకర్, హిమప్రభ, దూసి దుర్గారావు, వీరంనాయుడు పాల్గొన్నారు.

వీరఘట్టం మండలంలోని పలు విద్యాసంస్థల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం చేశారు.

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

వేపాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా మండలంలో ఎపి రైతుసంఘం జిల్లా నాయకులు చల్లా జగన్ ప్రచారం చేశారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మికులు, ప్రజల సమస్యలపై శాసనమండలిలో గళమెత్తే పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.బుచ్చిరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2023 -24 ఏడాదికి సంబంధించి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వతరగతి విద్యార్థులు 5లో ప్రవేశానికి, 10వ తరగతి విద్యార్థులు ఎంఇసి, సిఇసి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 24నాటికి అర్హులైన విద్యార్థులు apefssi.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సి, ఎస్టి విద్యార్థులు నవంబరు 1, 2010 నుండి 31 ఆగస్టు 2014 మధ్య జన్మించి ఉండాలన్నారు. బిసి, ఒసి విద్యార్థులు 1 సెప్టెంబర్ 2012 నుండి 31 ఆగస్టు 2014 మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

11.6 టన్నుల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-బాడంగి

సీజ్ చేసిన వాహనాలు

అక్రమంగా తరలిస్తున్న 11,630 కిలోల రేషన్ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బొబ్బిలి మండలం పిరిడి, గొల్లపల్లి గ్రామాల నుంచి నాలుగు వాహనాల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో బాడంగి మండలం ఆకులకట్ట జంక్షన్లో విజిలెన్స్ ఎస్ఐలు అశోక్, రామారావు మాటువేసి ఉన్నారు. ఆ జంక్షన్కు వాహనాలు రాగానే పట్టుకున్నారు. ఆ వాహనాల్లోని 11,630 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు.

అగ్నివీర్ రిక్రూట్మెంట్ ప్రారంభం

అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి ● రిక్రూట్మెంట్ డైరెక్టర్ కల్నల్ వినయ్కుమార్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న కల్నల్ వినయ్కుమార్

భారత సైనిక దళాల్లో అగ్నివీర్ నియామక ప్రక్రియ ప్రారంభమయ్యిందని, విశాఖపట్నం రిక్రూట్మెంట్ సెంటర్ డైరెక్టర్ కల్నల్ వినయ్కుమార్ చెప్పారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అగ్నివీర్ రిక్రూట్మెంట్ ప్రక్రియను వివరించారు. అగ్నివీర్ నియామకాల కోసం ఫిబ్రవరి 16 నుంచి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యిందని, మార్చి 15వరకు రిజిస్ట్రేషన్లు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. గత రిక్రూట్మెంట్లకు భిన్నంగా, అగ్నివీర్ ఎంపిక కోసం ముందుగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, నిర్ణీత తేదీల్లో నిర్వహించిన ఆన్లైన్ టెస్టు తరువాత, దానిలో ఉత్తీర్ణులైన వారికి శారీరక ధారుడ్య పరీక్ష, వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడతో సహా దేశంలో మొత్తం 76 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కంప్యూటర్ ఆధారిత ఆన్లైన్ రాత పరీక్ష జరుగుతుందని, ఈ మార్పులను అభ్యర్థులు గమనించాలని సూచించారు.

అభ్యర్థుల వయసు 17 సంవత్సరాల 6 నెలలు నిండి, 21 ఏళ్ల లోపు ఉండాలని, ఆయా పోస్టులను బట్టి పదో తరగతి నుంచి ఇంటర్ ఉత్తీర్ణత, ఇతర సాంకేతిక అర్హతలు ఉండాలని చెప్పారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ జనరల్ డ్యూటీ (ఉమెన్ మిలటరీ పోలీస్), అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్, అగ్నివీర్ ట్రేడ్స్మెన్, అగ్నివీర్ ట్రేడ్స్మెన్ 8వ తరగతి పాస్ మొదలగు ఆరు రకాల విభాగాల్లో రిక్రూట్మెంట్ జరుగుతోందని చెప్పారు. తొలిసారిగా మహిళలకు కూడా ఎంపిక నిర్వహిస్తున్నామన్నారు. పూర్తిగా ప్రతిభ ఆధారంగా రిక్రూట్మెంట్ ప్రక్రియ జరుగుతుందని, మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని కల్నల్ వినయ్ కుమార్ యువతను కోరారు.

డిఆర్ఒ ఎం.గణపతిరావు మాట్లాడుతూ, భారత సైన్యంలో యువత భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నియామక ప్రక్రియకు సంభందించిన పోస్టర్లను విడుదల చేశారు.

అవకాశాన్ని వినియోగించుకోవాలి : కలెక్టర్

జిల్లా నుంచి యువత పెద్ద ఎత్తున సైనిక దళాల్లో చేరేలా ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి చెప్పారు. విశాఖలోని ఆర్మీ రిక్రూటింగ్ అధికారి కల్నల్ వినయ్ కుమార్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ను కలిశారు. ఆర్మీలోకి ఎంపికల కోసం రూపొందించిన నూతన విధానం గురించి కలెక్టర్కు వివరించి జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సహకారాన్ని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 వేల యువజన గ్రూపులు న్నాయని, వీటిలో వున్న యువతను ఆర్మీ రిక్రూట్మెంట్కు దరఖాస్తు చేసేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. దీంతోపాటు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఆర్మీ రిక్రూట్మెంట్పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆర్మీ రిక్రూట్మెంట్కు సంబంధించిన సమాచారం జిల్లాలోని 678 గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో వుంచేలా చర్యలు చేపడతామన్నారు. ఆర్మీ అధికారి డా.జి.ఎస్.రణ్ ధావా, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు కూడా సమావేశంలో పాల్గొన్నారు.

శారదకు పురస్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

పురస్కారం అందుకుంటున్న చింత శారద

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లో బీ ద చేంజ్ ఫౌండేషన్ నిర్వాహకులు లావణ్య ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో అభ్యుదయ విద్యాసంస్థల ప్రిన్సిపల్ చింత శారదకు షీ ఇన్స్పైర్స్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 480 నామినేషన్లలో 85 మందిని ఎంపిక చేసి అవార్డులు బహూకరించారు.

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

నగరంలో భారీ మానవహారం

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు, జిల్లా శిశుమహిళా అభివృద్ధి , సాధికారత అధికారి బి.శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 8 గంటలకు కలెక్టరేట్ వద్దనున్న జ్యోతిభా పూలే విగ్రహం వద్ద నుంచి పోలీసు పెరేడ్ గ్రౌండ్స్, ఆర్టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్, రింగురోడ్డు దాసన్నపేట రైతు బజార్, కోట, ఆనందగజపతి ఆడిటోరియం వరకు భారీ మానవ హారం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్తోపాటు, ఎస్పి దీపికాపాటిల్ పాల్గొంటారని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలన, టీనేజ్ గర్భాల నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈమానవహారాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, ఉదయం 10 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో మహిళా దినోత్సవ కార్యక్రమం జరుగుతుందని, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన సఖి గ్రూపు సభ్యులకు, బాల్య వివాహాలను అడ్డుకున్న సిబ్బందికి ఈ సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ సమీర్ నందన్ హాజ్రై, ప్రసంగిస్తారని తెలిపారు.

ఇంటర్ పరీక్షలపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటర్ పరీక్షలు ఈ నెల 15 నుండి ఏప్రిల్ 4 వ తేదీ జరుగుతాయని జిల్లా కలెక్టర్ సూర్య కుమారి తెలిపారు. ఉదయం 9 నుండి 12 వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఎలాంటి అవాంతరాలు జరగకుండా జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. సోమవారం కాన్ఫరెన్స్ ద్వారా ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో 67 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని , 144 సెక్షన్ ఏర్పాటు చేయాలనీ పోలీస్, రెవిన్యూ అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద తాగు నీరు, అత్యవసర మందులతో ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలని డిఎంహెచ్ఒకు సూచించారు. పరీక్ష ప్రారంభానికి అర్ధ గంట ముందు నుండే విద్యుత సరఫరా తప్పకుండా ఉండాలని, పరీక్ష పూర్తయ్యేవరకు నిరంతర సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పరీక్ష సమయాలలో విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా బస్స లను అన్ని రూట్లలో నడపాలని, పరీక్ష పూర్తి అయ్యాక కూడా బస్సు సౌకర్యం ఉండేలా చూడాలని ఆర్టి.సి అధికారులకు ఆదేశించారు. పరీక్షల కోసం 4 ఫ్లైయింగ్ స్క్వాడ్లను , జిల్లాలో 7 స్టోరేజ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యాలయం లో ఒక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, సమాచారం కోసం 08922 237988 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు. సమావేశం లో పోలీస్, ఆర్టిసి, విద్యుత్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు

పటిష్ట ప్రణాళిక

కంప్లైంట్ బాక్సుల ద్వారా ఫిర్యాదుల స్వీకరణ : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల విక్రయాలపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్, మాదక ద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై, సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు నెలవారీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలని, దీనికోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై, పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్గించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాల ను అరికట్టేందుకు విద్యా సంస్థల గోడలపై టోల్ ఫ్రీ నెంబర్ ప్రదర్శించాలన్నారు. దీనికోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. మత్తు కల్గించే పదార్థాలను విక్రయించే షాపులపై నిఘా పెట్టాలన్నారు. మద్యం షాపుల్లో సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మందుల షాపులు, ఇతర ట్రేడర్స్తో సమావేశాలు నిర్వహించి, చట్టంలోని అంశాలను వివరించాలని చెప్పారు. ముఖ్యంగా మైనర్లకు మద్యం, పొగాకు, గంజాయి విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ, విద్యాసంస్థల్లో హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిసిపిఒ చైర్పర్సన్ హిమ బిందు, జాయింట్ యాక్షన్ ప్లాన్ నోడల్ ఆఫీసర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్ వి.సుధీర్, డిఎంఅండ్హెచ్ఒ డాక్టర్ ఎస్వి రమణకుమారి, ఔషధ నియంత్రణశాఖ ఎడి కె.రజిత, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.రత్నం, మున్సిపల్ హెల్తాఫీసర్ డాక్టర్ కెవిఎస్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణాధికారి ఎ.సత్యనారాయణ, జిల్లా యువజన సమన్వయాధికారి తదితరులు పాల్గొన్నారు.

అదుపులోనే నేరాలు

ఎస్పి ఎం.దీపిక

ప్రజాశక్తి- రేగిడి, వంగర

మహిళా పోలీసుతో మాట్లాడుతున్న ఎస్పి దీపిక

జిల్లాలో నేరాలు అదుపులో ఉన్నాయని ఎస్పి ఎం. దీపిక పాటిల్ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని ఉంగరాడ మెట్ట, వంగర పోలీసు స్టేషన్లను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. నేరాలకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేసి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అనేక నేరాలు గతం కంటే అదుపులో ఉన్నాయన్నారు. చిన్నారుల ఫ్యాక్టో నేరం, ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసులు తగ్గాయని చెప్పారు. భార్యాభర్తల తగాదాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దిశ చట్టం ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి ఒకటి చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 96కు 46 మంది పై పిడి యాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ముఖ్యంగా చీటీల పేరుతో ప్రజలు మోసపోతున్నారని, అందుకు పోలీసులతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. భోగాపురంలో చీటీల పేరుతో రూ.80 కోట్లు వరకు నష్టపోయారని, ఇప్పటికే కొంతవరకు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన కేసులు స్పందనలో ఫిర్యాదు చేస్తే రికవరికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో 72 పోలింగ్ కేంద్రాలలో 39 రూటులలో ఒక ఫ్లయింగ్ స్క్వాడ్తో పాటు డిఎస్పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందిని నియమిస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు చెప్పారు. 200 మీటర్ల లోపు వివిధ పార్టీల వారు టెంట్లు, ఇతర కార్యక్రమాలు చేపట్టరాదని తెలిపారు. రాజాం, బొబ్బిలి, విజయనగరం ఎమ్మెల్సీ ఎన్నికలలో స్థానికులు అభ్యర్థులుగా ఉండడంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అల్లర్లు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతాదని క్యూ లైన్లో ఉన్న వారందరికీ స్లిప్స్ ఉన్న వారికే ఓటు హక్కు వినియోగించుకొనేలా చూస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాలో 96 కేసులలో 46 మంది పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పితో పాటు సిఐ ఉపేంద్రరావు, రేగిడి, సంతకవిటి ఎస్ఐలు ఈ. శ్రీనివాసరావు, జనార్ధనరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను జిల్లా ఎస్పి దీపిక పాటిల్ సోమవారం పరిశీలించారు. మండలంలో 1,408 ఓట్లు ఉన్నాయని అధికారులు ఎస్పికి తెలిపారు. 26,27 పోలింగ్ కేంద్రాలలో మౌలిక సౌకర్యాలతో పాటు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

బిజెపి ప్రభుత్వం చేపడుతున్న ఎల్ఐసి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇతర జాతీయ బ్యాంకుల బలవంతపు పెట్టుబడులపై కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తూ సోమవారం స్థానిక ఎస్బిఐ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కనకాల పద్మనాభం, ఎస్ సూరిబాబు, నరసింహులు, రామకృష్ణ, అప్పారావు, జగదీష్, రమణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

రహదారిపై మురుగునీరు

పట్టించుకునే వారు కరువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిసి రోడ్డు వేసి కాలువలు నిర్మించక పోవడంతో ఇళ్ల నుంచి మురికి నీరు రోడ్డుపై పారుతోంది. నివాసాలు మధ్య మురికి నీరు నిల్వ ఉండటంతో కెవిఎల్ పురంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏపీ జీవీబీ బ్యాంక్ వెనుక ప్రాంతంలో ఉన్న వీధిలో కాలువలు లేక పోవడం వలన మురికి నీరు రోడ్డుపై పారుతోంది. వీధి మొత్తం మురికి నీరు రోడ్డు మీద నుంచి వస్తూ ఖాళీ స్థలంలో చేరడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు వాసనతో పాటు, దోమలు ప్రభావం ఎక్కువగా ఉండటం వలన స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

ఆ బాధ్యత కార్యదర్శులదే

ప్రజాశక్తి-వేపాడ

స్పందనలో వచ్చే అర్జీలను పరిష్కరించే బాధ్యత కార్యదర్శులదేనని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ స్పష్టంచేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామ సచివాలయాలలో ఇంతవరకు వచ్చిన ఫిర్యాదులపై చేపట్టిన చర్యలు, పరిష్కార వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, పంచాయతీరాజ్ మండల ఇంజినీరింగ్ అధికారి ఎండిఎం అలీ, గృహ నిర్మాణ సంస్థ ఎఇ, ఎపిఒ, ఎపిఎం ఎఇ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

25 మంది రక్తదానం

ప్రజాశక్తి-కొత్తవలస

సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ మండపంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర నాయకులు కెబిఎ రాంప్రసాద్, స్థానిక నాయకులు కోళ్ల శ్రీను, బొబ్బిలి అప్పారావు, పి.రత్నాజీ, కొరుపోలు అప్పారావు, బంగారు రమేష్, మాకేన నవీన్, ఇమంది దేముడుబాబు, ట్రస్ట్ సభ్యులు మీసాల దుర్గాప్రసాద్, ప్రగడ గిరిధర్, బొడ్డు రాంబాబు, ఎన్‌స్ రాజా బ్లడ్ బ్యాంక్ డాక్టర్ దివ్యవాణి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ అందిస్తున్న స్వామినాయుడు, గౌరీశంకరరావు

వికలాంగులకు వితరణ

ప్రజాశక్తి-బాడంగి

కొమరాడ మండలం కొదులగుంప గ్రామానికి చెందిన బెల్లాన గుంపస్వామి వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కుమారుడు, కోడలు గౌరీశంకరరావు, గీతాంజలి బాడంగి పాఠశాలలో 30 మంది వికలాంగ విద్యార్థులకు వితరణ చేశారు. బ్లాంకెట్, ప్లేట్, గ్లాసు, గిన్నె సెట్, పాఠశాలకు కూలింగ్ వాటర్ క్యాన్‌ను బొంగు స్వామినాయుడు చేతుల మీదుగా అందజేశారు. స్వామినాయుడు కూడా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రమేష్, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు త్రినాథ్, రమేష్, శ్రీదేవి, శారద, నారెమ్మ, మోహన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరుపుల రాజాకు ఘన నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలి

గుండెపోటుతో మరణించిన టిడిపి పత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల రాజాకు కోటలో సోమవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం కోసం రాజాను బొబ్బిలి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా అధిష్టానం నియమించిందని, బొబ్బిలి వచ్చి కార్యకర్తలతో సమావేశం పెట్టిన కొంతకాలానికి మరణించడం ఎంతో బాధగా ఉందని బేబినాయన అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, సీనియర్ నాయకులు రౌతు రామ్మూర్తి, నాయకులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యసంఘం జిల్లా కోశాధికారిగా రాజేష్

భామిని : కళింగ వైశ్య సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారిగా భామినికి చెందిన కోరాడ రాజేష్ ఎన్నికయ్యారు. ఆయనకు సోమవారం మండల కళింగ వైశ్య సంక్షేమ సంఘం సభ్యులు, జిల్లా సభ్యులు ప్రేత్యేక అభినందనలు తెలిపారు. కళింగ వైశ్య కుటుంబీకుల సంక్షేమం, కళింగ వైశ్య సమస్యలు పరిష్కారానికి, ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహణకు కృషి చేస్తానని, క్షేత్ర స్థాయిలో కళింగ వైశ్యలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పై జిల్లా కళింగ వైశ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని రాజేష్ తెలిపారు.

డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు

పార్వతీపురం టౌన్ : పట్టణ శివారున రాయఘడ రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులో మంటలు పుట్టి భారీగా చెలరేగాయి. దీంతో అంతర్ రాష్ట్రీయ రహదారితో పాటు పరిసర ప్రాంతాలకు దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతం నుంచి వచ్చే వాహనచోదకులు, పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్థానికులు, మున్సిపల్ ప్రజారోగ్య, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక వాహనంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ, పొగలు తగ్గకపోవడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారి, ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా పొగకమ్ముకుంది. దీంతో పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. దీర్ఘకాలంగా ఉన్న డంపింగ్ యార్డ్ తరలింపు సమస్యను పరిష్కరించేందుకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు, చొరవ చూపెడుతున్నప్పటికీ ఒక కొలిక్కి రాకపోవడం గమనార్హం.

హామీలను నెరవేర్చని ప్రభుత్వం

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి-మెరకముడిదాం

గత ఎన్నికలలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం వచ్చిందని ఉత్తరాంధ్ర పట్ట భద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. సోమవారం మండలంలో పలువురు ఓటర్ల కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుక భాటు తనాన్ని ప్రశ్నించటానికి, శాసన మండలిలో గొంతు వినిపించేందుకు ఒక అవకాశం ఇవ్వాలని పట్ట భద్రులను కోరారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని, పిల్లలకు పాఠాలు చెప్పనివ్వకుండా పనికి మాలిన యాప్ లు పెట్టి విద్యను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. గత ఎన్నికలలో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత జిపిఎస్ విధానాన్ని పెడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని గెలిపిస్తే వైసిపికి, వారి తప్పుడు విధానాలకు మద్దతు పలికినట్టేనని అన్నారు. పిడిఎఫ్ అభ్యర్థుల గెలిపించుకోవడం ద్వారా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అనేక రంగాలకు చెందిన వారి సమస్యలపై మండలిలో గళం వినిపించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. ఆమె వెంట సిఐటియు నాయకులు టివి రమణ ఉన్నారు.

ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

సుస్థిర అభివృద్ధికి బాల్య వివాహాలు అవరోధం

వేపాడ.. అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధికి బాల్య వివాహాలు అవరోధంగా ఉన్నాయని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయాధికారి బి.రామకృష్ణ అన్నారు. సోమవారం నెల్లిమర్లలోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్ష, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్యంలోనే గర్భందాల్చిన వారిలో 59 శాతం మంది మహిళలు కేవలం రక్తహీనతతో మరణిస్తున్నారన్నారు. అలాంటి మరణాలు జరగకుండా అడ్డుకట్ట వేయాలంటే బాల్యవివాహాలను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతిరోజు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా కాపాడుకోవచ్చన్నారు. జంక్ ఫుడ్ గురించి మాట్లాడుతూ పానీపూరి, పిజ్జా, బర్గర్‌లో టేస్టింగ్ సాల్ట్ పదార్థం వాడుతున్నారని దానివల్ల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ కె. ధనలక్ష్మి, రోహిణి, సీతమ్మ, శైలజరాణి, రామలక్ష్మి తదితర ఉపాధ్యాయులు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

వేపాడ : మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు. తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ మాట్లాడుతూ ఎవరైనా బాల్య వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ రాజేష్, సిడిపిఒ, అంగనవాడీ సూపర్వైజర్, గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

వంగర : విద్యార్థినిలు చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంఇఒ యాగాటి దుర్గారావు అన్నారు. సఖి కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థినిలతో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. ఉతికిన బట్టలు ఎండలో బాగా ఆరిన తర్వాతే వాటిని ధరించాలన్నారు. పౌష్టికాహారం తీసుకుని వైద్యులు సూచనల మేరకు ఐరన్ మాత్రలు వేయాలన్నారు. ఇతరులతో మాట్లాడేటప్పుడు వారి ప్రవర్తనను గమనించాలన్నారు. హెచ్ఎం ఎం రవణమ్మ, ఏఎన్ఎం విశాలాక్షి మాట్లాడుతూ రుతుక్రమం వచ్చేటప్పుడు పాటించవలసిన శుభ్రతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. అనంతరం సైన్స్ ప్రతిభ పోటీలలో ఇటీవల ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఇఒ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ జయకృష్ణ, కవిత, శేఖర్, ఆరోగ్య సిబ్బంది మరియమ్మ, సత్యవతి, కుమారి, శశికల పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ ఇంజనీరింగ్ కాలేజీలో రిసోర్స్ పర్సన్ ప్రవాష్ రంజన్ సాహూ, డేటాప్రో విశాఖపట్నం ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి బి.టెక్ ఐవి ఇయర్ సిఎస్ఇ స్టూడెంట్స్‌కు నిజ జీవితంలో ఉపయోగపడే పైథాన్ లాంగ్వేజ్ అప్లికేషన్స్‌పై వర్క్ షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ కంప్యూటర్ లాంగ్వేజ్‌లో పైథాన్ ప్రోగ్రామింగ్ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. ఎంఎన్‌సి కంపెనీలలో ఈ లాంగ్వేజ్‌ని ఎక్కువగా వినియోగిస్తున్నారని తద్వారా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని తెలిపారు. ఈ లాంగ్వేజ్ ద్వార ఏదైనా ఒక ప్రాజెక్టును తక్కువ కాలంలో, తక్కువ ఖర్చుతో వేగంగా అభివృద్ధి చేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒ జి.అనిల్ కుమార్, సిఎస్ఇ విభాగాధిపతి ఎమ్.ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే నైతిక విలువలు

ప్రజాశక్తి- గరివిడి

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు అలవర్చుకోవాలని ఆశయ సంస్థ అధ్యక్షులు రెడ్డి రమణ అన్నారు. మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు పుస్తక పఠనంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ఒక సంస్కృతిగా ప్రోత్సహించాలన్నారు. వీడియోలు చూడడం, వీడియో గేమ్‌లు ఆడడం కన్నా పుస్తక పఠనం మనపై ఎక్కువ ప్రభావం చూపుతుందన్నారు. పుస్తకాలు మెదడుకి మంచి ఎక్సర్‌సైజ్ ఇచ్చి ఆలోచనా దృక్పదాన్ని పెంచుతాయన్నారు. విద్యార్థులు యువత సెల్ ఫోన్లలో ఎక్కువ సమయం గడుపుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్. పి.ధూళికేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ రమణకుమారి

సైక్లింగ్‌తోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-విజయనగరం

సైకిల్ తొక్కడంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డిఎంహెచ్ఒ ఎస్‌వి రమణకుమారి తెలిపారు. స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద సైక్లింగ్ ఫర్ హెల్త్ ర్యాలీని ఆమె జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మహిళా ఆరోగ్యంతోనే కుటుంబ ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం, ఇతర అవాయువాల పనితీరు మెరుగు పడుతుందని చెప్పారు. రక్తపోటు, స్థూలకాయం, మధుమేహాన్ని నియంత్రిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ శారీరక శ్రమను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని కోరారు. సైక్లింగ్ చేయడం వల్ల పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్.సూర్యనారాయణ, ఎన్‌సిడి పిఒ పి.రవికుమార్, డెమో వి.చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

మహిళా దినోత్సవం సందర్భంగా సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పివిఆర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుధాకుమారి ఆధ్వర్యాన బాలికలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యవ్వన దశ ప్రారంభం, జాగ్రత్తలపై విద్యార్థినులకు వివరించారు. నేటి విద్యార్థులు సోషల్ మీడియా వినియోగం తగ్గించుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. మహిళలు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. మహిళలు సమతుల్య ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. అనీమియా, అధిక ఒత్తడి, ఈటింగ్ డిజార్డర్ వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి నుండి బయటపడడానికి కావల్సిన సమతుల ఆహారం, ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ మజ్జి. శశి భూషణ్‌రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామ్మూర్తి, వైస్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఘటనా స్థలంలో మరణించిన గౌరినాయుడు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-మెరకముడిదాం

ఆటోను ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని ఊటపల్లి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. బుదరాయవలస ఎస్ఐ నవీన్ పడాల్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఊటపల్లి నుంచి ట్రాక్టర్ వస్తుండగా అదే సమయంలో మెరక ముడిదాం నుండి ఊటపల్లి వెళ్తున్న ఆటోకు ట్రాక్టర్ చివరి భాగం తగలింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఊటపల్లికి చెందిన మండలం గౌరినాయుడు (55) రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎదురెదురుగా బైకులు ఢీ

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జామి

మండలంలోని జామి మాధవరాయమెట్ట వద్ద సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వేపాడ మండలం బానాది, సోంపురం గ్రామాలకు చెందిన పి.కార్తిక్, డి.బాలాజీల తలలకు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఎస్ఐ వీరబాబు కేసు నమోదు చేశారు.

జిటిపేటలో జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలో గుర్ల తమ్మిరాజు పేట గ్రామంలో యల్లమ్మ తల్లి జాతర సందర్భంగా ఈ నెల 9 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీరాములు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 94902 65104 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

IN THE COURT OF THE MVACT CUM II ADDL CHIEF JUDGE CITY CIVIL COURT : AT HYDERABAD
O.P.No. : 1515 of 2021

Between:
G. Swarajyam and others ...Petitioner
AND
J. Srivatsava and others ...Respondents

To,
1. J. Srivatsava S/o J. Surya Prakash Rao R/o: 21-4-11/A, Gudi Vidhi, Vizainagaram - 535002. (Owner cum driver)

Please take notice that the above petitioners have filed the case for grant of compensation for the death of G.Nagabhushanam, in a motor vehicle accident car bearing **No. AP-35-AJ-4444,** which occurred on **03-02-2021**, under the limits of **P.S.patamata.**

the above case is posted to **12-04-2023** at **10-30 A.M** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either on person or through an advocate, else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)
K. ANAND REDDY
D. VENKAT RAMANA
Counsels for the Petitioners
FlatNO. 212, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad- 500036.
Cell: 9848052455, 9848051707

IN THE HON'BLE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM- SPECIAL OFFICER UNDER TENANCY ACT AT SRIKAKULAM- ATC2/2015
I.A.9/2018, I.A.17/2020, I.A.255/2022

Between:- **Pagoti Appa Rao** --Petitioner / Petitioner
And:- **Dundu Ammaji** (Since Died) Dundu @Chinni Padmavathi and others --Respondents/Respondents

To,
R-4. Dundu Raviteja, s/o late Srinivasarao, Student, resident of H.No.3-53, Maruthinagar, New Colony, Puritipenta village, Gajapathinagaram Post,Vizianagaram Dist.

Where as an application has been filed under Sub-Section (1) of Section 16 of the Andhra Tenancy Act 1966 (Andhra Act XXIII of 1956) for the adjudication of a dispute and whereas you are mentioned as a party to the said dispute, take notice that it is proposed to hold an enquiry into the said dispute at the above mentioned court at Srikakulam on **21-03-2023 at 10.30 AM** and that you may appear at the said enquiry and give such evidence as may be necessary in support of your case, failing which the enquiry will be held and the dispute decided ex-parte.

Where as the afore mentioned applications **I.A.9/2018, 1.A.17/2020, 1.A.255 /2022** filed by the petitioner against you seeking the leave of the Hon'ble Court to deposit yearly ambaram/rent into the Hon'ble Court for the respective years and you are directed to appear and file your objections / counter in the said petitions at the above mentioned court at Srikakulam on **21-03-2023 at 10.30 AM** and, failing which the enquiry will be held and the dispute decided ex-parte
By order of the above Hon'ble Court

CHAMALLA NARSIMHA MURTY
Advocate for the Petitioner
New Colony, Srikakulam
Mobile: 9440344929

బ్రిడ్జిపై నిలిచిన వాహనం

ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి-గజపతినగరం

బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనం

గజపతినగరంలో చంపావతి నదిపై ఉన్న బ్రిడ్జిపై సోమవారం సాంకేతిక లోపంతో బొలెరో వాహనం నిలిచి పోయింది. గంటపాటు వాహనం కదల్లేదు. దీంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు భారీగా నిలిచి పోయాయి. ప్రయాణికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు, అసహనానికి గురయ్యారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. స్థానికులు, ప్రయాణికులు పోలీసుల బాధ్యత తీసుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తూ ముందుకు సాగారు.

ఎస్ఇబి స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశకి-బొబ్బిలి

మాట్లాడుతున్న ఎఎస్‌పి అస్మా ఫర్హీన్

పట్టణంలోని ఎస్ఇబి స్టేషన్‌ను సోమవారం ఎఎస్‌పి అస్మా ఫర్హీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లో వాహనాలు, రికార్డులు పరిశీలించారు. బొబ్బిలి సర్కిల్ పరిధిలో సారా నియంత్రణకు తీసుకుంటున్న చర్యల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తంచేశారు. ఎస్ఇబి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్ఇబికి సంబంధించిన నేరాల నియంత్రణకు గట్టిగా కృషి చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో మండల పరిధిలో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. మహిళా పోలీసులు ఎస్ఇబి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎస్ఇబి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిర్భయంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించి కావచ్చని డైట్ సైకాలజీ అధ్యాపకులు డి.ఈశ్వరరావు అన్నారు. సోమవారం కంటోన్మెంట్ నగరపాలక ఉన్నత పాఠశాలలో డైట్ సైకాలజీ అధ్యాపకులు డిఈశ్వరరావు టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలి, పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి. తరగతిలో వెనుకబడిన విద్యార్థులైన 'సి' డి గ్రేడ్ విద్యార్థులు సులభంగా పాసవడానికి మెళకువలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.కార్తీ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రజాశక్తి - వంగర

మండలంలో 2 సర్పంచులు, 4 వార్డు మెంబర్లకు సంబంధించి ఎన్నిక నిర్వహణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల పలువురు సర్పంచులు, వార్డు మెంబర్లు మృతి చెందడంతో ఖాళీలు ఏర్పడిన గ్రామాల్లో ఎన్నిక నిర్వాహణకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ఆయా గ్రామాల పబ్లిక్ ప్రదేశాలలో అధికారులు సోమవారం వేలాడదీశారు. సర్పంచులకు సంబంధించి ఓని అగ్రహారం, లక్ష్మింపేట, వార్డు మెంబర్‌కు సంబంధించి కొట్టిశ, ఇరువాడ, కొప్పరవలస, రుషింగి గ్రామాల్లో ఎన్నిక నిర్వహించవలసి ఉందన్నారు. వీటికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 7వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లోపింటి త్రినాధరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 62/2021.

Between:
Palleda Annapurna w/o Bangarappadu @ Bangaraju, aged 60 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District. ......Petitioner/Plaintiff.
And:
1. Maradana Alivelu Mangamma w/o Venkati, aged about 52 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
2. Boddana Pondoeu s/o Late Asirayya, aged about 55 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
3. Yelamanchili Ramana s/o Late Pyditalli, aged about 45 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
4. Yelamanchili Eswara Rao s/o Late Pyditalli, aged about 42 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
5. Yelamanchili Pyditalli s/o Late Yendodu, aged about 45 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram Distirct.
6. Vuttikayela Adinarayana s/o Late Pyditalli, aged about 45 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
7. Kondru Chinnayya s/o Late Pakeeru, aged about 40 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
8. Sabbisetti Krishna s/o Late Thata, aged about 52 years, Hindu, Business, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
9. Sabbisetti Nageswara Rao s/o Late Thata, aged about 50 years, Hindu, Business, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
10. Bootu Srinivasa Rao s/o Rama Rao, aged about 47 years, Hindu, Cultivation, residing at Garbham Village, Merakamudidam Mandal, Vizianagaram District.
11. The State of A.P. rep. by the District Collector, Vizianagaram.
12. The Revenue Divisional Officer, Vizianagaram, Vizianagaram District.
13. The Tahsildar, Merakamudidam Mandal, Vizianagaram District.

.....Respondents/Defendants.

ప్రకటన

పైనెంబరు దావాలో ఏడవ ప్రతివాదికి ప్రోసెస్ నాలుగైదు పర్యాయములు కట్టినను నోటీసులు అందనందువలన వాది కోరిన ప్రకారము పేపరు ప్రకటన ఆర్డరు వేసినారు. సదరు పేపరు ప్రకటన అంశముల ప్రకారము ఓ.యస్. 62/2021 గలది **తే. 12-4-2023 దీన** మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వాయిదా కలదు. సదరు వాయిదాకు ఏడవ ఆసామి అయిన కోంద్రి చిన్నయ్య తండ్రి లేటు పకీరు, గర్భాం గ్రామము, మెరకముడిదాం మండలం, విజయనగరం జిల్లా, పర్సనల్‌గా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **తే.12-4-2023 దీన ఉదయం గం.10-30 నిముషములకు** చీపురుపల్లి కోర్టులో హాజరు కావలసి యున్నది. లేనియెడల మీ పరోక్షములో దావా ప్రొసీడింగ్సు జరుపబడును అని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

విజయనగరం.
తే.06-03-2023

సి. హెచ్.వేణుగోపాలరావు
న్యాయవాది, చీపురుపల్లి.